వైఎస్ఆర్ కడప వార్త
తెలుగు జాతీయ దినపత్రిక
గురువారం 23 ఏప్రిల్ 2026



## రేణుక ఎల్లమ్మ తిరుణాలకు ఘనంగా ఏర్పాటు

సిద్ధవటం ఏప్రిల్ 22 ప్రభాతవార్త



సిద్ధవటం మండలంలోని మాచుపల్లి గ్రామంలో వెలసిన శ్రీ జగజ్జని రేణుక ఎల్లమాంబ తిరుణాల సందర్భంగా ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ పూజారి నరసింహారాజు బుధవారం మాట్లాడుతూ ఏప్రిల్, 30 నుండి, మే, 4 వరకు తిరునాళ్ల మహోత్సవం వైభవంగా జరుగుతుందని 30న, తెల్లవారుజామున ధ్రుజారోహణ, అంకురార్పణ, మే 1 న ఉదయం అమ్మవారి ఊరేగింపు,2 వ తేదీ మధ్యాహ్నం వేదమంత్రాలు వచ్చే అమ్మవారి కళ్యాణం, సాయంత్రం 6 గంటలకు అమ్మవారి ఊరేగింపు, 3 న అమ్మవారికి బోనాలు, వృషభ రాజములచే బండ లాగులు పోటీలు 4 న అమ్మవారి ఊరేగింపు, సాంస్కృతిక కార్యక్రమాలు జరపడానికి గ్రామ పెద్దలు అన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

### 24 నుండి ఏపీలో

## పాఠశాలలకు వేసవి సెలవులు

ఎడ్యుకేషన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త :

రాష్ట్రంలో తీవ్ర ఎండల నేపథ్యంలో పాఠశాలలకు ఏప్రిల్ 24 నుంచి వేసవి సెలవులు ప్రకటించారు. జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్నాయి. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతుండటంతో, విద్యార్థుల ఆరోగ్య భద్రత దృష్ట్యా విద్యాశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. ఇటీవలి రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలతో పాటు వేడి గాలులు (హీట్‌వేవ్ పరిస్థితులు) తీవ్రంగా ప్రభావం చూపుతున్నాయి. మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లడం ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు సెలవుల్లో అప్రమత్తంగా ఉండాలని విద్యాశాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ప్రత్యేకంగా కాలువలు, చెరువులు, నదుల దగ్గరకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేసవిలో ఈతకు వెళ్లే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండటంతో తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు కలిసి విద్యార్థుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ వేసవి కాలంలో చిన్నపిల్లల ఆరోగ్యం అత్యంత ముఖ్యమని, నిరక్ష్యం ప్రాణాపాయ పరిస్థితులకు దారితీయవచ్చని హెచ్చరించారు.

### పేదరిక నిర్మూలనలో నిజమైన సైనికులు

# వెలుగు మహిళా ఉద్యోగులు



వెలుగు మహిళా ఉద్యోగులకు మొబైల్ ఫోన్లో అందజేస్తున్న జగన్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న జగన్మోహన్ రాజు

రాజంపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

పేదరిక నిర్మూలనలోనూ, పేదలకు నిరంతరం అందుబాటులో ఉండి సేవ చేసే మొదటి సైనికులు వెలుగు సిబ్బందేనని జగన్మోహన్ రాజు కొనియాడారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకు వెలుగు మహిళలు పోషిస్తున్న పాత్ర ఎంతో కీలకమని ,వ్యవస్థలో జవాబుదారితనం పెంచడం, పారదర్శకమైన వ్యవస్థను ఏర్పాటు చేసేందుకే గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మొబైల్ ఫోన్లు అందజేస్తున్నారని టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు అన్నారు. పేదలను పీడించే సమస్యల పరిష్కారంలో వెలుగు సిబ్బందికి సెల్ ఫోన్ల పంపిణీ కీలకము కానున్నాయున్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం బోయనపల్లి వెలుగు కార్యాలయంలో గ్రామ సమాఖ్య అసిస్టెంట్లకు మొ బైల్ ఫోన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జగన్ రాజు మహిళలకు మొబైల్ ఫోన్లో పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాధ్యతకు ప్రతీకలు తెలుగింటి ఆడపడుచులు అని కొనియాడారు.ప్రతి ఇంటి నుంచి ఒక మహిళా పారిశ్రామికవేత్త రావాలనుకునే ప్రభుత్వం ఉద్దేశ్యం అన్నారు.గత విధ్వంసక పాలనలో కోమాలకు వెళ్లిన ఆర్థిక పరిస్థితిని ఎంతో మెరుగుపరచిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుది అన్నారు. కేవలం ఫోన్లు ఇవ్వడం మాత్రమే కాదని, పేదల బ్రతుకులు మార్చే ఒక గొప్ప సంకల్పమని పేర్కొన్నారు.గత పాలకుల విధ్వంసకర పాలన వల్ల కోమాలోకి వెళ్ళిన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చంద్రబాబు గారి నాయకత్వం మళ్ళీ గాడిలో పెట్టి మెరుగుపరుస్తోందని ధీమా వ్యక్తం చేశారు. గత పాలకుల ఫ్యూడల్ విధానాలను తీవ్రంగా విమర్శించారు. గతంలో అమాయక ప్రజల నుంచి వేలిముద్రలు సేకరించి వారి భూములను లాక్కునే దుస్థితి ఉండేదని, అటువంటి అక్రమాలకు చెక్ పెడుతూ పాలనలో జవాబుదారీతనం తీసుకురావడానికే ఈ సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. సొంత చెల్లికి కూడా న్యాయం చేయలేని వారు రాష్ట్రం లోని అక్క చెల్లెమ్మలకు ఏం న్యాయం చేస్తారు అని తెలిపారు.మొబైల్ ఫోన్ల పంపిణీపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. మహిళల శక్తి సామర్థ్యాలపై నమ్మకంతో ప్రభుత్వం చేస్తున్న ఈ పెట్టుబడి గ్రామీణ అభివృద్ధికి బాటలు వేస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గన్నె సుబ్బ నరసయ్య, ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దుకృష్ణారెడ్డి, టిడిపి మండలాధ్యక్షులు మేడికొండ రవి కుమార్ నాయుడు, వీరబల్లి అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, ఒంటిమిట్ట నరసింహారెడ్డి ,మన్నూరు పీఏసీ చైర్మన్ ముళ్ల గురు సుబ్రహ్మణ్యం నాయుడు, పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు అనసూయమ్మ, వీరవల్లి మండల జనరల్ సెక్రటరీ సిబ్యాల రామాంజనేయులు, క్లస్టర్ ఇంచార్జ్ దగ్గుబాటి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు కళాధర్ , కొవ్వూరు సుబ్రహ్మణ్యం నాయుడు, రాజంపేట ఏపిఎం నాగార్జున నాయుడు, ఏపీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేస్తామని

# విద్యార్థుల ప్రతిజ్ఞ



ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

మాదకద్రవ్యాలను నిర్మూలించి దేశ భవిష్యత్తుకు తోడ్పడతామని కామిశెట్టి డిగ్రీ కళాశాల విద్యార్థులు 100 మీటర్ల జాతీయ పతాకాన్ని ప్రదర్శించి ప్రతిన పూనారు. బుధవారం కొరపాడు రోడ్డులోని కామిశెట్టి డిగ్రీ కళాశాల ఎదురుగా వైబ్రాంట్స్ కలాం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈగల్ టీం సహకారంతో నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలనకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామమని అందుకు యువత నడుం బిగించాలని కోరారు. వైబ్రాంట్స్ ఆఫ్ కలాం ఆర్గనైజేషన్ ప్రొద్దుటూరు ఇన్చార్జి శ్రీదేవి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మదకద్రవ్యాల నిర్మూలన అవగాహన సదస్సులో భాగంగా ప్రొద్దుటూరులో కూడా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, లెక్చరర్ కృష్ణమూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిర్డ్స్ సొసైటీ సుబ్బారెడ్డి, ఆర్ఎంపీ డాక్టర్ గౌస్ మొహిద్దిన్, ఆదరణ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బైసాని సత్యనారాయణ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మూడేళ్ళలో వచ్చేది మన ప్రభుత్వమే



### అధికారంలోకి వచ్చాక ప్రతి బాధితుడికి న్యాయం
### నిర్వాసితుల సమస్యలపై పోరాటం చేద్దాం
### ప్రజా దర్బార్ లో మాజీ సీఎం వైయస్ జగన్ మోహన్ రెడ్డి

పులివెందుల, ఏప్రిల్ 22 , ప్రభాత వార్త :

రాష్ట్రంలో మరో మూడేళ్లలో వచ్చేది మన ప్రభుత్వమే అని అధికారంలోకి రాగానే ప్రతి బాధితుడికి న్యాయం చేస్తామని నిర్వాసితుల తరుపున పోరాటానికి సిద్ధం అని వైఎస్సార్సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల మూడు రోజుల పర్యటనలో రెండో రోజు వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల మధ్య బిజీ బిజీగా గడిపారు.లింగాల మండలం ఇప్పట్ల గ్రామంలో ఇటీవల మరణించిన పార్టీ నాయకుడు సుధాకర్ రెడ్డి కుటుంబాన్ని ఆయన స్వయంగా పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చుతూ,"ధైర్యంగా ఉండండి.. మీ కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది" అంటూ భరోసా ఇచ్చారు. ఇప్పట్లకు బయలుదేరిన జగన్ మోహన్ రెడ్డికి దారి పొడవున చిన్నారులు మహిళలు పెద్ద ఎత్తున తరలి వచ్చి కాన్వాయ్ కి కోసం ఎదురు చూస్తున్న ప్రతి ఒక్క చోట ఆపి అక్కడ ఉన్న ప్రజల్ని ఆప్యాయంగా పలకరించారు. ఈ పర్యటనలో భాగంగా కడప-పార్నపల్లి రహదారిపై రాజారెడ్డి కాలనీకి చెందిన నిర్వాసితులు జగన్‌ను కలిసి తమ గోడును వినిపించారు. జాతీయ రహదారి నిర్మాణం కారణంగా తమ ఇళ్లు కోల్పోతున్నామని, ప్రభుత్వం తగిన పరిహారం ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.వారి సమస్యలను శ్రద్ధగా విన్న జగన్ మోహన్ రెడ్డి "ప్రస్తుతం పోరాటం చేద్దాం అయిన న్యాయం జరగకపోతే మూడేళ్లలో మనం అధికారంలోకి వస్తాం.. అప్పుడైనా తప్పకుండా న్యాయం చేస్తాం" అని స్పష్టం చేశారు. అవసరమైతే బాధితుల కోసం పోరాటం చేయడానికి కూడా సిద్ధమని తెలిపారు. ఈ వ్యాఖ్యలు నిర్వాసితుల్లో కొత్త ఆశలను నింపాయి.

### సుధాకర్ రెడ్డి కుటుంబానికి ధైర్యం చెప్పిన జగన్

ఇప్పట్ల గ్రామానికి చేరుకున్న జగన్, అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ఈ మధ్య మృతి చెందిన సుధాకర్ రెడ్డి ఇంటికి వెళ్ళి నివాళాలు అర్పించారు.మీ కుటుంబానికి ఎల్లప్పుడు అవినాష్ రెడ్డి అండగా ఉంటాడు అని మీకు ఏ సమస్య వచ్చినా మీకు న్యాయం చేస్తాడు అని అధైర్య పడవద్దు ధైర్యంగా ఉండండి అని భరోసా ఇచ్చారు. అక్కడ నుంచి పులివెందులలోని క్యాంప్ కార్యాలయానికి చేరుకుని ప్రజాదర్బార్ నిర్వహించారు.

పులివెందుల పర్యటనలో జగన్ ప్రజలతో నేరుగా మమేకమవుతూ, వారి సమస్యలను తెలుసు కోవడంపై దృష్టి సారించడం పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపింది. ప్రజల సమస్యలపై స్పందిస్తూ, భవిష్యత్తులో న్యాయం చేస్తానన్న హామీతో ఆయన పర్యటన రాజకీయంగా కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ పర్యటనతో ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని స్పందించే నాయకుడిగా జగన్ మరోసారి తన ప్రత్యేకతను చాటుకున్నా రని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ కార్యక్రమంలో ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### చంటి బిడ్డలు, బాలలతో

# బిక్షాటన చేస్తే కఠిన చర్యలు

### కలెక్టర్ ఆదేశాలతో అధికారుల హెచ్చరిక



మున్సిపల్ కమిషనర్ లక్ష్మీ నారాయణతో సమావేశమైన వివిధ శాఖల అధికారులు

రాజంపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

రాజంపేట పరిసర ప్రాంతాల్లో ఎక్కడైనా చంటి బిడ్డలు ,బాలలతో భిక్షాటన చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు,సబ్ కలెక్టర్ సూచనతో మున్సిపల్ కార్యంలో కమిషనర్ లక్ష్మీనారాయణ అధ్యక్షతన రాజంపేట డివిజన్ లెవల్ చైల్డ్ ప్రొటెక్షన్, లీగల్ అడ్వైజరి కమిటీ సమావేశం జరిగింది.చంటి బిడ్డలు,బాలల తో బిక్షాటన చేసినా, చేయించినా భారతీయ బాలల న్యాయ చట్టము ప్రకారం చర్యలుతప్పవని హెచ్చరిక జారీచేశారు. సమావేశంలో మున్సిపల్, పోలీస్, శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా త్వరలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తామని ప్రకటించారు.మీ పరిసరాలలో అలాంటి కార్యకలాపాలు జరుగుతున్న అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరిన అధికారులు.సమావేశంలో మున్సిపల్ కమీషనర్ లక్ష్మీ నారాయణ,డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ సుభాన్,సాంఘిక సంక్షేమ అధికారిణి హైమవతి,అర్బన్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకటేష్,ఐసిడిఎస్ అధికారిణి నాగలక్ష్మి,మున్సిపల్ అధికారి మల్లికార్జున,తదితర అధికారులు పాల్గొన్నారు.

# చెన్నంపల్లె పాఠశాలకు గ్రహణం వీడింది

### :రితేష్‌రెడ్డి చేతుల మీదుగా పాఠశాల భవనానికి శంకుస్థాపన : పాఠశాల భవనానికి పూర్తి సహకారం అందిస్తా





బద్వేలు ,ఏప్రిల్ 22, ప్రభాతవార్త:

మున్సిపాలిటీ పరిధిలోని చెన్నంపల్లె పాఠశాలకు గత కొద్ది రోజులుగా గ్రహణం పట్టడంతో పాఠశాల భవనానికి శంకుస్థాపన కాకపోవడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అనేక ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయాన్ని టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో చొరవ తీసుకుని అధికారులతో మాట్లాడి పాఠశాలకు పట్టిన గ్రహణం వీడేలా చేశారు. రూ.20లక్షల రూపాయలతో మొదటి దశగా చెన్నంపల్లె పాఠశాల భవనానికి టీడీపీ బద్వేలు ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. నేషనల్ హైవే కారణంగా రోడ్డు మీద ఉన్న చెన్నంపల్లె పాఠశాల పూర్తిగా తొలగించడంతో రూ.25లక్షలు నేషనల్ హైవే అధికారులు నిధులు మంజూరు చేశారు. ఇన్ని రోజులు పాఠశాలకు భవనం లేక అద్దె భవనంలో 2 సంవత్సరాలు నిరీక్షించిన ఉపాధ్యాయులకు ఉపశమనం దొరికింది. పాఠశాల భవనానికి శంకుస్థాపన చేసేందుకు స్థలం లేక ఉన్న డబ్బులు సరిపోక కొట్టుమిట్టాడుతున్న తరుణంలో ఉపాధ్యాయులు టీడీపీ నాయకుడు రితేష్‌రెడ్డికి మొరపెట్టుకున్నారు.ఈ మేరకు స్పందించిన రితేష్‌రెడ్డి విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో ఉంచుకుని అధికారులతో మాట్లాడి చెన్నంపల్లె పరిధిలోని 50 సెంట్లు ప్రభుత్వ పాఠశాలకు కేటాయించేలా ఉత్తర్వులు తెచ్చారు. వెంటనే భవనానికి కావలసిన ఏర్పాట్లు చేసి బుధవారం ఉపాధ్యాయులతో కలిసి రితేష్‌రెడ్డి పాఠశాలకు శంకుస్థాపన చేశారు. ఈ పాఠశాలలో 65 మంది విద్యార్థులు, 5 మంది ఉపాధ్యాయులు ఉన్నారని, 5 గదులు లేనిదే విద్యా బోధన అందించడం కష్టమని రితేష్‌రెడ్డికి విన్నవించారు. ఆయన స్పందిస్తూ ప్రస్తుతానికి రూ.20 లక్షలతో రెండు గదులు నిర్మిస్తామని తర్వాత మరికొన్ని గదులు నిర్మించేందుకు నిదులు మంజూరుచేయించి పాఠశాల భవనం పూర్తి అయ్యేలా చేసే బాధ్యత నాది అని ఉపాధ్యాయులకు హామి ఇచ్చారు.దీంతో పాఠశాల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేయడమే కాకుండా వేలాది రూపాయలు పెట్టి ప్రైవేటు పాఠశాలలో చేర్చకుండా కేవలం ఉపాధ్యాయులపై నమ్మకంతో నే ప్రభుత్వ పాఠశాలలో చేరుస్తున్నామని ఇన్ని రోజులు భవనం లేక ఎండలో ఎండి, వానలో తడిచి ఇబ్బంది పడ్డారని, ఇప్పుడు రితేష్‌రెడ్డి చొరవతో పాఠశాల భవనానికి మంచిరోజులు వచ్చాయని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఉపాధ్యాయులు లక్ష్మీనరసయ్య, వెంకటేశ్వర్లు, నాగపార్వతి, శారద, రమణారెడ్డి, సర్వశిక్షా అభియాన్ ఈఈ గురివిరడ్డి, ఏఈ చంద్రశేఖర్, శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డి, నరసింహనాయుడు, శివయ్యస్వామిలతో పాటు రమేష్ స్వామి పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు.

# మహిళాలు శక్తివంతంగా ఉంటేనే దేశం బాగుంటుంది

వేంపల్లె:ఏప్రిల్ 22 ప్రభాతవార్త

మహిళలు శక్తి వంతంగా ఉంటేనే దేశం బాగుంటుందని అందుకోసమే పోలీస్ శాఖ మహిళాల భద్రత కోసం పాటు పడుతున్నదని పులివెందుల డిఎస్పీ మురళి నాయక్ పేర్కొన్నారు. కడప పోలీస్ ఆధ్వర్యంలో మహిళ భద్రతపై బుధవారం స్థానిక ఎంఎంఆర్ కళ్యాణమండపంలో మహిళాలకు, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మురళి నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మహిళాలపై జరుగుతున్న వేధింపులను అరికట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సైబర్ నేరాలకు దూరంగా ఉండాలని కోరారు. బాలికలకు ఇన్ స్టా గ్రాం ను నమ్మరాదని చెప్పారు. మహిళలపై జరిగే వేధింపులు, గృహహింస, బాలికలపై నేరాలు వంటి సంఘటనలు జరిగితే భయపడకుండా వెంటనే పోలీసు సహాయం తీసుకోవాలని సూచించారు. మహిళల రక్షణే లక్ష్యంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపట్టుతున్నట్లు తెలిపారు. ప్రాథమిక దశలో బాలికలు తప్పు చేస్తే జీవితం నాశనం అవుతుందని చెప్పారు. సిఐ నర్సింహులు మాట్లాడుతూ అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని చెప్పారు. అలాగే అపరిచిత కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని తెలిపారు. పాఠశాలలకు వెళ్లేటప్పుడు అబ్బాయిలు వేధింపులకు గురి చేస్తే వెంటనే తల్లిదండ్రులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాలికలు వారి హద్దులో ఉండాలని కోరారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, సైబర్ మోసాల సమయంలో తక్షణ సహాయం కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లుకు వెంటనే ఫోన్ చేయాలని కోరారు. మహిళల భద్రత పరిరక్షణలో పోలీస్ శాఖతో పాటు ప్రజల సహకారం కూడా అత్యంత అవసరమని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండాలని కోరారు. సోషల్ మీడియాను నమ్మరాదని చెప్పారు. ఈ సమావేశంలో ఎస్ఐలు తిరుపాల్ నాయక్, తాయార్ హుస్సేన్, శ్రీనువాసరావు, బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుష్మా, ఐసిడిఎస్ సూపర్ వైజర్ స్వర్ణలత, వెలుగు ఎపిఎం వెంకటేశ్వర్లు, శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.







## గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

దువ్వూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఇడమడక గ్రామంలో పెరుమాళ్ల జయన్న(66) అనే వ్యక్తి గడ్డి మందు సేవించి ఆత్మహత్య చేసుకున్నట్లు దువ్వూరు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. జయన్నకు అర్ధ ఎకరా పొలం ఉంది. అలాగే భార్య గత 5 సంవత్సరాల నుండి ఆరోగ్యం సరిగా లేక బాధపడుతూ ఉండేవాడు. గత రెండు సంవత్సరాలుగా వ్యవసాయంలో సరైన పంట రాక అలాగే భార్య వైద్య ఖర్చుల నిమిత్తం సుమారు 10 లక్షల రూపాయలు అప్పు చేశాడు. అప్పు తీర్చలేనన్న బెంగతోను భార్య ఆరోగ్యం సరిగా లేకపోవడంతోను జీవితంపై విరక్తి చెంది ఈనెల 13వ తేదీన ఇంటిలో ఉన్న పురుగుల మందుని సేవించాడు. వెంటనే స్థానికులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా పొద్దుటూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో బుధవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## ఉపాధి హామీ కూలీలకు నిధులు విడుదల

సిద్ధవటం, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ప్రతి ఉపాధి కూలీ పనులకు వెళ్లాలని కూలీలకు రావలసిన బకాయిలు చెల్లింపులు చేపడతామని ఏపీవో నరసింహులు తెలిపారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం క్రింద జాబ్ కార్డ్ కలిగి ఉన్న కూలీలు పనులకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం కూలీలకు బడ్జెట్ విడుదల చేసిందని చేసిన పనులకు 6 నెలల నగదు చెల్లింపు వారం లోపల కూలీల అకౌంట్లో జమ అవుతుందని ప్రతి ఒక్కరికి చెల్లింపు చేపడతామని ఏపీవో నరసింహులు తెలిపారు.

# వైవీయూలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

**వైవీయూ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**
ప్రతి ఒక్కరూ చెట్లను దత్తత తీసుకొని పరిరక్షించాలని ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అన్నారు. భూమి సంరక్షణపై అవగాహన పెంపొందిచేందుకు ప్రతి సంవత్సరం జరిపే దరిత్రి దినోత్సవం ఈ ఏడాది " అవర్ పవర్ అవర్ ప్లానెట్ " అనే థీమ్‌తో యోగి వేమన వేమన విశ్వవిద్యాలయం జియాలజీ శాఖ నిర్వహించింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా ఆపివేయాలని, నీటి వనరులను కాపాడి రేపటి తరానికి అందించాలన్నారు. డిపార్ట్మెంట్ ఆఫ్ జియాలజీ శాఖ విభాగాధిపతి డా.వి. సునిత మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలలో కాలుష్యం, వాతావరణ మార్పులు, సహజ వనరుల క్షీణత వంటివి తీవ్రమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తు తరాల కోసం భూమిని పరిరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. దరిత్రి దినోత్సవ ఆవిర్భావ చారిత్రక నేపథ్యం గురించి వివరించారు. ప్రొఫెసర్ రఘుబాబు మాట్లాడుతూ వాతావరణ మార్పు, ఆహారపు గొలుసు పై పడడం వల్ల జీవ వైవిధ్యత దెబ్బతింటుందని తద్వారా మానవ జీవన శైలి పై ప్రభావం ఉంటుందన్నారు. ప్రొఫెసర్ ఎన్. జయరాజ్ మాట్లాడుతూ సహజ శిలాజ ఇంధనాలను వినియోగించడం తగ్గించి ప్రత్యామ్నాయ ఇంధనాలను, రవాణాకు సైకిల్ ను వాడాలన్నారు. సహా ఆచార్యులు డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ కాలుష్యాన్ని తగ్గించాలంటే విద్యుత్తుతో నడిచే వాహనాలను పెంచాలన్నారు. డాక్టర్ సిద్దిరాజు గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. ఈ సందర్భంగా దరిత్రి దినోత్సవ థీమ్ సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎర్త్ సైన్స్ ఆచార్యులు తుమ్మలకుంట శివ, డాక్టర్ టి. లక్ష్మీప్రసాద్, స్కాలర్లు విద్యార్థులు పాల్గొన్నారు.




# నష్టం కలిగించే వస్తువులను తొలగించాలి



**వైవీయూ, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**
భూమికి నష్టం కల్గించే వస్తువులను తొలగించే బాధ్యత అందరిపై ఉందని బొటానికల్ గార్డెన్ డైరెక్టర్ ఆచార్య ఏ మధుసూదన్ రెడ్డి అన్నారు. దరిత్రి దినోత్సవం సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్లాస్టిక్ ఇతర వ్యర్థపదార్థాలను తొలగించే కార్యక్రమాన్ని సహచర అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి నిర్వహించారు. భూమికి నష్టం కలిగించే వస్తువులు, ప్రత్యామ్నాయ వస్తువుల వినియోగం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి. శ్రీనివాస్ కార్యక్రమం నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నజీర్ అహ్మద్, డాక్టర్ వెంకట్ రామ్, డాక్టర్ టి. లక్ష్మీప్రసాద్, డాక్టర్ రాజగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## ప్రధానిపై వ్యాఖ్యలు ఖండించిన

# బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**



బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్‌పర్సన్ సుప్రజ, ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆమె, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రధానిని అవమానకరంగా విమర్శించడం తగదని అన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న కీలక నిర్ణయాలతో ప్రధాని మోదీ ప్రజల మన్ననలు పొందారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకులు సంస్కారంతో వ్యవహరించి, హుందాతనంతో విమర్శలు చేయాలని సూచించారు. అలాగే మల్లికార్జున ఖర్గే పేరుతో ఈ వ్యాఖ్యలు వెలువడటం తగదని పేర్కొంటూ, దేశ ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని ఆమె అన్నారు.

# హైస్కూల్ హెడ్మాస్టర్‌కు ఘన సన్మానం



**మైదుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**
మైదుకూరు పట్టణ కడప రోడ్డు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ గా పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన అహ్మద్,పదోన్నతి పై వెళ్లిన కె. బాబు ను, ప్రస్తుతం పాఠశాలలో హెడ్మాస్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సీనియర్ ఉపాధ్యాయులు ఎ.రాముడులకు శాలువ మెమెంటోలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం మరువలేనిదని, విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ గోశెట్టి రామమోహన్, సీనియర్ ఉపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు కె.ఆనందరావు, తవ్వ ఓబుల్ రెడ్డి, సురేంద్ర నాయక్, రాజేంద్ర ప్రసాద్, రవీంద్రారెడ్డి, గురు మోహన్, తేజ, ప్రభాకర్, పద్మజ, ధనలక్ష్మి, మాధవి లత, స్వర్ణలత, రమాదేవి, నీరజ, సునీత, చౌడేశ్వరి భారతి, స్వర్ణ లక్ష్మి మధురిమ,సుబ్బమ్మ, రికార్డు అసిస్టెంట్ ప్రసాద్, విశ్వం తదితరులు పాల్గొన్నారు.

# బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడికి సన్మానం

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 22, ప్రభాతవార్త**
బద్వేలు సీమాంక్ ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడిగా నియమితులైన డాక్టర్ క్రాంతి కుమార్‌ను పట్టణ అభివృద్ధి సొసైటీ, ఆవాజ్ కమిటీ, మహనీయుల ఆశయాల సాధన సమితి సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దుశ్శాలువా, పూలమాలతో ఆయనను అభినందించారు. పట్టణ అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు, పరికరాలు, మందులు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. డాక్టర్ క్రాంతి కుమార్ స్పందిస్తూ, ఆసుపత్రి అభివృద్ధికి కృషి చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తార్, రసూల్, గురుమూర్తి, రాధాకృష్ణ, నారాయణ రెడ్డి, సుబ్బారావు, వెంకట రాజేష్ కుమార్, తోట రాము పాల్గొన్నారు.



# శ్రీ చైతన్యలో గ్రాడ్యుయేషన్ వేడుకలు




**మైదుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**
మైదుకూరు పట్టణంలోని కడప రోడ్డు శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రాథమిక విద్యను పూర్తిచేసుకుని సెకండరీ విద్యలో నికి ప్రవేశిస్తున్న ఐదవ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమం ముఖ్యఅతిథిగా పాఠశాల ఏజిఎం నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏజిఎం మాట్లాడుతూ మా విద్యాసంస్థలో విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి మా ఉపాధ్యాయ బృందం నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యార్థికి జీవితంలో ఇలాంటి గ్రాడ్యుయేషన్ వేడుకలు మరుపురానివిగా ఉంటాయన్నారు. విశ్వవిద్యాలయాలలో జరిగే ఇలాంటి వేడుకలు శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ వేడుకలతో అభినందిస్తారు. ప్రైమరీ ఇన్చార్జి కుసుమ కీర్తి మాట్లాడుతూ మా సంస్థలో చదువుతున్న విద్యార్థులను అన్ని రంగాల్లో విజయం సాధించేటట్లుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, ఫరూక్, సుశీల, శశిరేఖ, మొదలైన ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# జగన్‌ను కలిసిన తుమ్మిశెట్టి సునీల్

**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త :**



మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని బద్వేల్ పట్టణానికి చెందిన వైఎస్సార్సీపీ యువ నాయకులు తుమ్మిశెట్టి సునీల్ కలిశారు. బద్వేల్ నియోజ కవర్గంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మరియు పార్టీ బలోపేతానికి తీసుకుంటున్న చర్యల గురించి ఈ భేటీలో చర్చించినట్లు వారు తెలిపారు, యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ పార్టీ కోసం అంకితభావంతో పనిచేయాలని ఈ సందర్భంగా జగన్ సునీల్ కుమార్‌కు దిశానిర్దేశం చేశారు. తమ ప్రియతమ నేతను కలవడం పట్ల సునీల్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు.

# జగన్‌ను కలిసిన పళ్లెం యల్లారెడ్డి

**బద్వేలు అర్బన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త :**



జగన్మోహన్‌రెడ్డిని అట్లూరు మండలం, వేములూరు పంచాయతీ అధ్యక్షులు పళ్లెం యల్లారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యల్లారెడ్డి అందిస్తున్న సేవలను జగన్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధతను, నిరంతరం ప్రజల చెంత ఉంటూ చేస్తున్న సేవా కార్యక్రమాలను జగన్మోహన్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పళ్లెం ఎల్లారెడ్డి తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తమ అభిమాన నాయకుడు జగన్మోహన్ రెడ్డిని కలవడం పట్ల యల్లారెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ఆయన చూపిన అభిమానం తనపై బాధ్యతను మరింత పెంచిందని పేర్కొన్నారు.

# ఆర్‌పిలకు పని భారం తగ్గించి పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**మైదుకూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**
ఆర్‌పిలకి పెండింగ్ లో ఉన్న 5నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలు చెల్లించి యాప్‌ల పని భారం తగ్గించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పిల యూనియన్ అధ్యక్షులు కె.సి బాదుల్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 5 నెలలు నుండి జీతాలు అందక పోతే జీవితం ఎలా గడవాలని ఇంటి అద్దె కరెంటు బిల్లులు పాల కోసం అష్టా కష్టాలు పడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విజయనగరం పట్టణంలో జొన్న గుడ్డిలో పనిచేస్తున్న ఆర్ పి జయలక్ష్మి పని ఒత్తిడి కారణంగా విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో మరణించారని ఆమె మరణం ముమ్మాటికి ప్రభుత్వ హత్య అని ఆమె కుటుంబానికి అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకొని న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆర్‌పిలపై రోజు కొక్క కొత్త యాప్‌ను తీసుకురావడంతో పని ఒత్తిడికి గురవుతున్నారన్నారు. ఒక యాప్ తీసుకొచ్చి రెండు రోజుల్లో టార్గెట్ పెట్టి పని చేయమని ఒత్తిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇంజనీర్లు చేయాల్సిన పనిని టెన్త్ క్లాస్ చదువుకున్న ఆర్‌పిలకు ఎటువంటి ట్రైనింగ్ ఇవ్వకుండా టైం(బౌండ్) లిమిట్ పెట్టి పని చేయించడం వలన ఆర్ పి జయలక్ష్మి చనిపోయిందని మొన్న "మన పొదుపు మన డబ్బులు"నేడు "మైక్రో ఫైనాన్స్" యాప్‌ల పేరుతో డ్వాక్రా సంఘాల మహిళలు ఓటీపి పేరుతో పని భారం ఒత్తిడి తగ్గించి ఎస్‌హెచ్‌జి మీటింగ్ లోకేషన్ యాప్ కూడా తొలగించాలని డిమాండ్ చేశారు. ఆర్‌పిలకు హెచ్ ఆర్ పాలసీ అమలు చేసి కనీస వేతనాలు ఇవ్వాలని పిఎఫ్ ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. మెప్మా కార్యాలయంలో పనిచేస్తున్న హరిప్రసాద్ వ్యవహార శైలి ఆర్‌పిల పట్ల చులకన భావం యూనియన్ల వద్దని అంటున్న వైఖరి మార్చుకోవాలని లేకపోతే తగిన మూల్యం చెల్లించక వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మైదుకూరు ఆర్‌పి కార్యకర్తల నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది ఈ కమిటీలో అధ్యక్షురాలుగా కె.పద్మావతి, కార్యదర్శిగా డి.కవిత, ఉపాధ్యక్షురాలుగా డి.లావణ్య,సహాయ కార్యదర్శిగా పి.మస్తాన్ బి, కోశాధికారిగా ఎస్.మహబూబ్ చాన్ లను ఎన్నుకోవడం జరిగింది.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి.వేణుగోపాల్, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పి. శ్రీరాములు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఏ.వి.శివరామ్, కడప జిల్లా ఆర్ పి జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, కడప నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్బరాయుడు, ఆర్‌పి కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# అనాథ వృద్ధులకు వైద్య సేవలు అందిస్తాం



**బద్వేల్ అర్బన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త :**
బద్వేల్ పట్టణం ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహంలోని అనాథ వృద్ధులకు ప్రభుత్వ హాస్పిటల్ తరఫున ఉచిత వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని ప్రభుత్వ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జహంగీర్ భాష అన్నారు, బుధవారం పట్టణంలోని ఆనంద నిలయం నిరాశ్రయుల వసతి గృహం అనాథ వృద్ధులను వారు పరామర్శించి వారికి ఫ్రూట్స్, చల్లని మజ్జిగ తినుబండారాలు వితరణ కార్యక్రమాన్ని జహంగీర్ భాష చేతుల మీదుగా నిర్వహించారు, అనంతరం జహంగీర్ భాష మాట్లాడుతూ అనేక రకాలుగా ఆసరా కోల్పోయి ఆశ్రమాన్ని ఆశ్రయించిన అనాథ వృద్ధులను వారి బాగోగులను చూసుకుంటున్న ఆశ్రమ నిర్వాహకులు పిడతల రవికుమార్ సేవలు మరువలేనివి అన్నారు,వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అనాథ వృద్ధులకు అవసరమైన ఉచిత వైద్య సేవలు అందించే విధంగా తాము కృషి చేస్తామన్నారు, ప్రభుత్వ ఆసుపత్రిలో అనుభవ కలిగిన డాక్టర్లు ఉన్నారని అన్ని రకాల వ్యాధులకు సంబంధించిన ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు, ఈ కార్యక్రమంలో గొడుగునూరు ప్రతాప్, దొడ్ల కేశవ,షేక్ ముస్తఫా,రఫీ,గొల్లపల్లి చలమయ్య, గోరె, షేక్ జిలాని భాష మరియు పలువురు పాల్గొన్నారు.

# 23న అంగన్వాడీ పోస్టులకు ఇంటర్వ్యూలు

**కడప, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:**
జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న ఆంగన్‌వాడీ వర్కర్లు, ఆంగన్‌వాడీ హెల్పర్లు పోస్టుల భర్తీకి సంబంధించి ఈ నెల 23వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 30 ఆంగన్‌వాడీ వర్కర్లు, 141 ఆంగన్‌వాడీ హెల్పర్ల పోస్టులకు సంబంధించి జిల్లాలోని అన్ని రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఆయా పరిధిలోని మండలాలకు అభ్యర్థులు 23 (గురువారం) తేదీన ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు తమ అర్హతలకు సంబంధించి అవసరమైన పత్రాలు వెంట తీసుకొని నిర్ణీత సమయానికి హాజరు కావలసిందిగా సూచించడమైనదన్నారు. అర్హులైన మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆ ప్రకటనలో పీడి పేర్కొన్నారు.

# ప్రొద్దుటూరు అభివృద్ధిపై మాట్లాడే అర్హత ఎమ్మెల్యే వరదకు లేదు

**ప్రొద్దుటూరు ఏప్రిల్ 22 ప్రభాతవార్త**
ప్రొద్దుటూరు నియోజకవర్గ అభివృద్ధి పై మాట్లాడే నైతిక హక్కు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డికి లేదని 25 ఏళ్ల పాటు ఎమ్మెల్యేగా ఉండి చేయలేని అభివృద్ధిని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఐదేళ్లలోనే చేయగలిగారని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ సిఎస్ ఖాజా మొహిద్దిన్ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలలో మాజీ ఎమ్మెల్యే రాచపల్లి శివప్రసాదరెడ్డి అధికార పార్టీ ఎమ్మెల్యేగా చేసిన అభివృద్ధి గురించి చెప్పడానికి ఎన్నో ఉన్నాయని కానీ 25 సంవత్సరాలు ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా అధికార పార్టీ తరపున వరదరాజు రెడ్డి చేసిన అభివృద్ధి ఏంటో స్పష్టం చేయగలరా అని సవాల్ విసిరారు. ఇటీవల నూతన కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనుల గురించి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులు రెడ్డి వి ఎస్ ముక్తియార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. వారు చెప్పేవన్నీ శుద్ధ అబద్ధాలని గత వైసిపి పాలనలోని కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులు 52 కోట్లతో చేపట్టి అందులో 21 కోట్లు పనులు పూర్తయ్యాయని బిల్లులు కూడా అప్లోడ్ చేయడం జరిగిందన్నారు దీనికి సంబంధించిన బిల్లు అమోంటును మంజూరు చేయడానికి టిడిపికి రెండేళ్లు పట్టిందని ఎద్దేవా చేశారు. అది కూడా కాంట్రాక్టర్‌కు ఉన్న సత్సంబంధాల వల్ల బిల్లులు మంజూరు అయ్యాయని స్థానిక ఎమ్మెల్యే వల్ల కాదన్నారు. గత వైసిపి పాలనలో నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు తక్కువ కాలంలోనే ధనవంతులయ్యారన్న వీఎస్ ముక్తియార్ వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి తన అబ్బ రాజారెడ్డి కాలంలోనే ఇన్కమ్ టాక్స్ కట్టేవారని మాజీ ఎమ్మెల్యే రాచమల్ల శివప్రసాద్ రెడ్డి కూడా పల్లి నుండి ధనవంతుడైనని వాటిలోనికి ధనం పై వ్యామోహం లేదని స్పష్టం చేశారు గత చరిత్ర ప్రజలకు తెలుసు అన్నారు రాష్ట్రంలో నవరత్నాలు అమలు అయ్యాయో లేదో మహిళలను అడిగి తెలుసుకుంటే మంచిదన్నారు కుటుంబంలో సూపర్ అమలు అవుతుందో లేదో కూడా తెలిసిపోతుందని సూచించారు. గత వైసిపి పాలకమండలిలో గవిని సర్కిల్ నుండి వాసవి సర్కిల్ వరకు కోటి 90 లక్షలతో అభివృద్ధి పనులు చేపడితే ముత్యాలు 10 కోట్ల రూపాయలు వెచ్చించారనడం అతని అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. మున్సిపల్ చైర్మన్‌గా ముక్తియార్ ఏ విధమైన ఆదాయం చూపారు స్పష్టం చేయాలన్నారు అమృత్ పథకం టిడిపి ప్రభుత్వాన్ని దేనిని ఆ పథకం కోసమే మున్సిపాలిటీ అప్పుల్లో కురుకుపోయిందని వివరించారు ఇప్పటికైనా నూతన కూరగాయల మార్కెట్ అభివృద్ధి పనులు ఎమ్మెల్యే వరద పూర్తి చేయాలని లేదంటే తమ ప్రభుత్వం వచ్చాక పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.



శివాలయం భూముల లీజుకు దేవాదాయ శాఖ అధికారుల అనుమతులు ఉన్నాయా లేదా అన్న దానికి సమాధానం చెప్పకుండా మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పై అనవసరమైన వ్యాఖ్యలు చేయడం కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డికి తగదు అన్నారు. కేవలం తాము అడిగే శివాలయం భూముల లీజు అనుమతులపై దేవదాయ శాఖ అధికారులు విడుదల చేసిన లేఖను బహిర్గత పరచాలని పేర్కొన్నారు. అంతేగాని ప్రజలను తప్పుదోవ పట్టించే మాటలు వద్దని సూచించారు సమావేశంలో మాది కౌన్సిలర్ గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

# సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా బాధ్యతలు స్వీకరణ

**ఒంటిమిట్ట ఏప్రిల్.21. (ప్రభాతవార్త)**
మండల కేంద్రమైన ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో వెంకటేశ్వర్లు బుధవారం నూతన సీఐ గా బాధ్యతలు స్వీకరించి రిజిస్టర్ పై సంతకం చేయడం జరిగింది. కర్నూలు డిఐజి కోయ ప్రవీణ్ ఉత్తర్వుల మేరకు బదిలీల్లో భాగంగా పి వెంకటేశ్వర్లును ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ గా బదిలీ చేయడం జరిగింది. ఈసందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దొంగతనాలు, జూదం, మట్కా వంటి సంఘ విద్రోహక శక్తులపై శాంతిభద్రతల పై ప్రత్యేక నిఘా పెడతానని, ట్రాఫిక్ సమస్య నియంత్రణ చర్యలపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు. మండలంలో సమస్యలు ఏమైనా ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకుని వచ్చినట్లయితే సకాలంలో పరిష్కరించేందుకు వీలుంటుందన్నారు. మండల వాసులకు ఎల్లప్పుడూ తాను తన సిబ్బంది అందుబాటులో ఉంటారన్నారు.

# సకాలంలో పన్నులు చెల్లించి కార్పొరేషన్ అభివృద్ధికి పాటు పడండి..

**కడప కార్పొరేషన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త:**



ఇంటి పనులు, కరెంటు బిల్లులు సకాలంలో చెల్లించి కడప నగర పాలక సంస్థ అభివృద్ధికి పాటుపడాలని రెవెన్యూ ఆఫీసర్ కన్నయ్య నగర వాసులను కోరారు. బుధవారం కడప కార్పొరేషన్‌లోని తన చాంబర్లో కన్నయ్య మాట్లాడుతూ ఈ మాసంలో ఇప్పటివరకు రెవెన్యూ వసూళ్ల రూ. 10 కోట్లు వసూలు అయినట్లు వెల్లడించారు. ఈరోజు 1.6 కోట్లు వసూలు అయినట్లు చెప్పారు. ఈ నెలాఖరికి ఇంకా రూ.12 నుంచి రూ.15 కోట్లు వసూలు అవుతాయని తెలిపారు. రెవెన్యూ వసూళ్లపై సంతోషాన్ని వ్యక్తం చేశారు.

# పట్టపగలే చోరీ
# ఆరు తులాల బంగారం అపహరణ



**గోపవరం ,ఏప్రిల్ 22, ప్రభాతవార్త**
గోపవరం మండలం పెద్దగోపవరం గ్రామంలో పట్టపగలే చోరీ జరిగింది. ఉదయం కూలి పనులకు కుటుంబ సభ్యులు మెల్లగా దీనిని అవకాశంగా తీసుకున్న దుండగులు ఇంటిలోకి ప్రవేశించి దోపిడీకి పాల్పడ్డారు.ఇంటిలో ఉన్న సుమారు ఆరు తులాల బంగారు ఆభరణాలు అపహరించబడినట్లు బాధిత మహిళ తెలిపారు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని సిబ్బందితో కలిసి దర్యాప్తు ప్రారంభించారు.ఈ ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొంది. పోలీసులు కేసు నమోదు చేసి దుండగుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

# శ్రామికుల సంఖ్యను పెంచాలి

**దువ్వూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న పనులలో శ్రామికుల సంఖ్యను పెంచాలని ఏపీఓ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందిచే సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ముగిసినందున ఉపాధి హామీలో శ్రామికుల సంఖ్యను పెంచవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అడిగిన ప్రతి శ్రామికునికి పని కల్పించవలసిన బాధ్యత ఉందని, అందువల్ల క్షేత్ర స్థాయిలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లు పనులు కల్పించాలన్నారు. అలాగే ఉపాధి హామీకి సంబంధించిన రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ ఇందిరా ప్రియాంక, సిబ్బంది పాల్గొన్నారు.

# సంప్రదించారు, వెంటనే స్పందించారు

**వేంపల్లి: ఏప్రిల్ 22 ప్రభాతవార్త**
కుమ్మరాంపల్లి వాటర్ ప్లాంట్లో రిపేరు కారణంగా నీళ్లు రావడంలేదని ప్రజలు ఆ గ్రామ టీడీపీ ఇంచార్జి మాజి ఆర్మీ రెడ్డయ్య ను సంప్రదించగా అయన తక్షణం స్పందించి వాటర్ ప్లాంట్ ను తన సొంత నిధులతో రిపేరు చేయించారు. ప్రజా సమస్యల పట్ల కూటమి ప్రభుత్వం తక్షణం స్పందిస్తుంది అనడానికి ఇది ఒక ఉదాహరణ.మండలం లో నీ కుమ్మరాంపల్లి పంచాయతీ పరిధి లో వాటర్ ప్లాంట్ రిపేరు రావడం తో ఆ గ్రామ ప్రజలు నీటి సమస్య గురించి ఇంచార్జి రెడ్డయ్య వెంటనే ఆ గ్రామ ప్రజల సమస్య ల పై స్పందించి వాటర్ ప్లాంట్ రిపేరు చేయించారు.వారు అయనను ప్రజలు అభినందనలు తెలిపారు.



# విద్యార్థులకు క్రమశిక్షణ పట్టుదల ఎంతో అవసరం

**సుండుపల్లె, ఏప్రిల్ 22,ప్రభాతవార్త :**
చైతన్య పాఠశాలలో 3వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ డాక్టర్ కొండూరు రెడ్డిరాజు,డైరెక్టర్ కె.సి. రెడ్డయ్య రాజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ కొండూరు రెడ్డిరాజు మాట్లాడుతూ, విద్య యొక్క ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థుల విజయమే తమ విజయం అని భావిస్తూ, శ్రద్ధ, ఆసక్తి, పట్టుదల, ఏకాగ్రత వంటి గుణాలు విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాదులని అలాగే తల్లిదండ్రుల విద్యార్థుల అభివృద్ధి క్రమశిక్షణ ఎంతో అవసరమని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు సరైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు.




# మహిళలకు ఉచిత పెయింటింగ్ శిక్షణ

**ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 22 ప్రభాత వార్త**
రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో ఫెవిక్రిల్ కంపెనీ సహకారంతో ఆ కంపెనీ ప్రతినిధి హరిణి బుధవారం మహిళలకు ఉచిత పెయింటింగ్ శిక్షణ ఇచ్చారు. ఈ పెయింటింగ్ క్లాసెస్ నందు దాదాపు 75 మంది మహిళలు తర్ఫీదు పొందారని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి, ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ భారతి, సెక్రటరీ సాయి ప్రీతి తెలిపారు. రోటరీ ట్రస్ట్ ప్రెసిడెంట్ అయిన రోటరీ క్లబ్ మాజీ గవర్నర్ ముత్యాల ప్రభు హకారంతో రోటరీ భవనం నందు తర్ఫీదు పొందిన మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.




# నాదెండ్ల భాస్కర్ రావు మృతి తీరని లోటు

## జనసేన పార్టీ సీనియర్ నేత దాసరి రవిశంకర్

**వేంపల్లె ఏప్రిల్ 22 (ప్రభాత వార్త)**
జనసేన పార్టీ పిఏసి చైర్మన్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తండ్రి భాస్కర్ రావు మృతి తీరని లోటు అని జనసేన పార్టీ సీనియర్ నేత డా.దాసరి రవిశంకర్ అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఆయన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆకాల మరణానికి చింతిస్తూ పవిత్రాత్మకు శాంతి కలగాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

# ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో ఆటో స్టాండ్ ప్రారంభం



ఆటో స్టాండ్ ప్రారంభిస్తున్న దృశ్యం

**పీలేరు, ఏప్రిల్ 22 ప్రభాతవార్త :**

పీలేరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ఆటో స్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పీలేరు ఎంవీఐ అధికారిణి విజయ్ కుమారి ముఖ్య అతిథిగా హాజరై ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పురం రామమూర్తి, బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోదేషా వలి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంవీఐ విజయ్ కుమారి మాట్లాడుతూ “బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్ ఏర్పాటుతో ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలి“ప్రతి ఒక్కరూ యూనిఫామ్ ధరించి ఆర్ సి బుక్, ఇన్సూరెన్స్ లైసెన్స్ పొల్యూషన్ ప్రతి ఒక్కటి కలిగి ఉండాలని నిబంధనలు సక్రమంగా పాటించాలని సూచించారు. మార్కెట్ ఛైర్మన్ పురం రామమూర్తి మాట్లాడుతూ ఆటో కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. ఆటో డ్రైవర్లకు సీరియల్ నెంబర్ స్టిక్కర్లను అందజేశారు. బోదేషా వలి మాట్లాడుతూ బిస్మిల్లా ఆటో యూనియన్ తరపున ప్రతి ఒక్కరు సభ్యత్వం సద్వినియోగం చేసుకోవాలని స్టాండ్ ఏర్పాటుకు సహకరించిన అధికారులు ప్రజా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు, పురుషోత్తం రెడ్డి, వెంకీ,ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు : గఫూర్



చెత్తసేకరణను పర్యవేక్షిస్తున్న గఫూర్

**చౌడేపల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యంపై అశ్రద్ధ వహిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని డిఎంపిడిఓ గఫూర్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని ఆమినిగుంట పంచాయతీ శింగిరిగుంటలో ఉదయాన్నే హరిత రాయబారులచే నిర్వహించబడుతున్న తడి, పొడి చెత్తల సేకరణను పర్యవేక్షించారు. పందిళ్ళపల్లి పంచాయతీలోని ఎస్‌డబ్ల్యుపిసిని సందర్శించారు. ప్రతి ఇంటికీ వెళ్ళి చెత్తను సేకరించి సకాలంలో షెడ్లవద్దకు చేర్చాలన్నారు. అనంతరం వర్మికంపోస్టు ఎరువు తయారీ విధానాన్ని వివరించారు. డిపిఓలు మోహన్, అమరనాథ్ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# పాము కాటుతో మహిళ మృతి

**నిమ్మనపల్లి ఏప్రిల్ 22 ప్రభాతవార్త**



విష సర్పం కాటేసి మహిళ మృతి చెందిన విషాదకర సంఘటన, బుధవారం నిమ్మనపల్లె మండలంలో వెలుగు చూసింది. మృతురాలి కుటుంబీకుల కథనం మేరకు.. తవలం గ్రామం ఎగువపల్లి కు చెందిన లేట్ చెన్నకేశవులు భార్య అలివేలమ్మ (45), ఇంటి ముందు పడుకుని ఉండగా విసి సర్పం కాటేసి తీవ్ర అస్వస్థతకు గురైంది. కుటుంబీకులు గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా డాక్టర్లు పరీక్షించి, వైద్యం అందించే లోపే మృతి చెందింది. మరిన్ని వివరాలను పోలీసులు వెల్లడించాల్సి ఉంది.

## మద్యం దుకాణాలను తనికీ చేసిన ఎక్సైజ్ సీఐ భీమలింగ, ఎస్సై జభీఉల్లా

**రామసముద్రం ఏప్రిల్ 22 ప్రభాతవార్త**



రామసముద్రం మండల కేంద్రంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ శాఖ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎక్సైజ్ సీఐ భీమలింగం, ఎస్సై జబీఉల్లా ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో మద్యం నాణ్యత, స్టాక్ రిజిస్టర్లు, ధరల పట్టికలను పరిశీలించారు, వీరు మాట్లాడుతూ మద్యం షాప్ లలో ఎమ్మార్పీకి మించి విక్రయాలు చేయువద్దని, గడువు ముగిసిన మద్యం నిల్వలు ఉండకూడదని దుకాణదారులకు తెలిపారు.నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ భీమలింగ ఎస్సై జబీ ఉల్లా హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రయాణీకుల పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలి

**పీలేరు ఏప్రిల్ 22 ప్రభాతవార్త:**



ఆటో దారులు తమ వాహనంలో ప్రయాణించే వారి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని పీలేరు ఎంవిఐ విజయ్ కుమారి, వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ పురం రామమూర్తి తెలిపారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోదేషా వలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొత్త ఆటో స్టాండ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ బస్టాండ్ ఆవరణంలో ఆటో స్టాండ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని అన్నారు. ఆటో డ్రైవర్లు వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు విధిగా అనుసరించాలని చెప్పారు. ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. అలాగే వాహనం నడిపే సమయంలో తప్పనిసరిగా యూనిఫామ్ ధరించడం, ఆర్‌సీ బుక్, ఇన్సూరెన్స్, లైసెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ మొదలగు పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ఆటో కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. అనంతరం ఆటో డ్రైవర్లకు సీరియల్ నెంబర్ల స్టిక్కర్లను అందజేశారు. బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బోదేషావలి మాట్లాడుతూ, యూనియన్ సభ్యత్వాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని, ఆటో స్టాండ్ ఏర్పాటు కోసం సహకరించిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోళ్ళ కిషోర్ నాయుడు, పురుషోత్తం రెడ్డి, వెంకీతో పాటు ఆటో యూనియన్ నాయకులు, ఆటో డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మండల కేంద్రంలోని తూర్పు ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

**రామసముద్రం ఏప్రిల్ 22 ప్రభాతవార్త**



మండలకేంద్రం లోని ప్రభుత్వ తూర్పు శాలలో వార్షికోత్సవ వేడుకలు హెచ్ ఎం హేమలత ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంఈవో హేమలత వీరిని ఉపాధ్యాయులు విద్యార్తులు సాధరంగా స్వాగతం పలికారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఈ వేడుకలను ప్రారంభం చేశారు. పాఠశాల ప్రాంగణాన్ని పచ్చని తోరణాలు కట్టి పలు రకాల పుష్పాలతో అలంకరణ చేశారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన ఎం ఈ వో హేమలత మాట్లాడుతూ ఈ పాఠశాల హెచ్ ఎం హేమలత విద్యతో పాటు క్రమశిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, పాఠశాల పచ్చధనం, పరిశుభ్రతకు నిలయం ఈపాఠశాలఅని కొనియాడారు, ప్రతి విద్యార్థిని తన బిడ్డలులాగా వారిని అక్కున చేర్చుకుని విద్య అందించారని,హెచ్ హేమలత చేసిన సేవలు ఎన్నటికి మరువనని, ప్రభుత్వం ఏవైనా కార్యక్రమాలు నిర్వహిస్తే ముందుంటారని అన్నారు.ప్రతి ఒక్క విద్యార్థి ఒకవేయంతో చదివి మంచి ఉద్యోగాలతో స్థిరపడి తల్లిదండ్రులకు, విద్యనేర్పిన గురువులకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. హెచ్ ఎం హేమలత మాట్లాడుతూ ఈ పాఠశాలలో 7సంవత్సరాలుగా హెచ్‌ఎంగా విధులు నిర్వహించానని, ప్రతి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి దండ్రులు తనకు సహాయ సహకారాలు అందించారని వారిని ఎన్నటికీ మరువనని అన్నారు. వచ్చేనెలలో నేను ఉద్యోగ విరమణ చేస్తున్నాని మీరు తప్పక మదనపల్లికి రావాలన్నారు.ఈపాఠశాలలో జరిగే వేడకలను నన్ను ఆహ్వానం చేస్తే తప్పకవస్తానని అన్నారు,మీ ప్రేమ అనురాగాలకు వెలకట్టలేనదని ముఖ్యంగా ఈ పాఠశాల ఉపాధ్యాయులకు,ముఖ్యంగా విద్యార్థుల తల్లి దండ్రులకు ఒకటే చెపుతున్న వేసవి సెలవులు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు తమ ఆరోగ్యంపై భద్రతపై ప్రత్యేక శ్రద్దతీసుకోవాలన్నారు ఎండతీవ్రత ఎక్కువగా ఉండే ఈ కాలంలో పిల్లలు అప్రమత్తంగా ఉండాలని తల్లిదండ్రులు కూడ వారిపై పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. పాఠశాల సిబ్బందికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన న్నారు. ఎంఈవో హేమలతకు చిరు సన్మానం చేశారు.ఉపాధ్యాయులు హెచ్ ఎం హేమలతను శాలువకప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానం చేశారు, ఒకమరువు రాని సంఘటన విద్యార్థులు హెచ్ ఎం ను సన్మానం చేసారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.ఈపాఠశాల వార్షికోత్సవం లో పాల్గొన్నా ఎం ఈవో హేమలత హెచ్ ఎం హేమలత, సంధ్యారాణి, జ్యోతి రాణి, గాయిత్రి దేవి, నాజిని బేబీ, జాకీర్ హుస్సేన్, పవిత్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి విచ్చేసిన వారికి హెచ్ ఎం హేమలత భోజనాలు ఏర్పాట్లు చేశారు.

# బాల్యవివాహాలు-టీనేజ్ గర్భధారణపై అవగాహన కార్యక్రమం

**కె.వి.పల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త:**



మండలం లోని ఎంపీడీవో కార్యాలయంలో బాల్యవివాహాలు, టీనేజీ గర్భధారణ నివారణపై మండల స్థాయి అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో రాజమ్మ అధ్యక్షత వహించారు. ఎంపీడీవో సుధాకర్, ఎంఈఓ రెడ్డి భాష, ఐసిడిఎస్ సూపర్వైజర్లు అన్నపూర్ణ, భారతి, శంకరమ్మ, మెడికల్ ఆఫీసర్ రేష్మ, హెల్త్ సూపర్వైజర్ వెంకటరమణ, పోలీస్ విభాగం సిబ్బంది, సోషల్ వర్కర్లు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఏప్రిల్ 9 నుంచి 23 వరకు నిర్వహిస్తున్న పోషణ పక్వాడా కార్యక్రమం భాగంగా తల్లి-శిశు పోషణ, చిన్నారుల మెదడు అభివృద్ధి ప్రారంభ దశ ప్రేరణ, అంగన్వాడీలకు సమాజ మద్దతు సమీకరణ వంటి అంశాలపై చర్చించారు. పిల్లలు మొబైల్, టీవీ వినియోగాన్ని తగ్గించడంలో తల్లిదండ్రులు మరియు సమాజ పాత్ర ఎంత ముఖ్యమో వివరించారు. టీనేజ్ గర్భధారణ ఎక్కడ ప్రారంభమవుతుందో, పెద్దల విద్య (అడల్ట్ ఎడ్యుకేషన్) ద్వారా అవగాహన కల్పించడం, బాల్యవివాహాల దుష్ప్రభావాలు, చదువు ప్రాముఖ్యత, సైబర్ నేరాలపై జాగ్రత్తలు వంటి అంశాలపై నిపుణులు వివరణ ఇచ్చారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త, ఏఎన్ఎం, ఆశా వర్కర్ తమ గ్రామాల్లో హోం విజిట్ల ద్వారా తల్లిదండ్రులకు బాల్యవివాహాలు, టీనేజ్ గర్భధారణ నివారణ చర్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే రాబోయే జనగణనపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, స్వయంగా నమోదు చేసుకునే విధానాన్ని వివరించారు. గ్రామ స్థాయిలో సమాజ భాగస్వామ్యంతో బాల్యవివాహాలు, టీనేజ్ గర్భధారణలను అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలని పిలుపునిచ్చారు.

## శ్రీచైతన్య టెక్నో స్కూల్లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



**మదనపల్లి ఏప్రిల్ 22 ప్రభాతవార్త**

పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో గల శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో యూకేజీ మరియు 5వ తరగతి విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలు అత్యంత ఘనంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించబడినవి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఏజీఎం జి. సురేష్ గారు, ఆర్ ఐ శ్రీధర్ విద్యార్థులను అభినందిస్తూ క్రమశిక్షణ, పట్టుదల, లక్ష్యసాధనపై దృష్టి పెట్టాలని సూచించారు. చిన్న వయస్సు నుంచే మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని వారు సందేశం అందించారు.ఈ వేడుకలకు పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి విజయలక్ష్మి అధ్యక్షత వహించారు.ఆమె విద్యార్థుల సాధనను ప్రశంసిస్తూ, ఉపాధ్యాయుల అంకితభావాన్ని కొనియాడారు. తల్లిదండ్రుల సహకారం వల్లే విద్యార్థులు ఈ స్థాయికి చేరుకున్నారని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా గ్రాడ్యుయేషన్ దుస్తుల్లో సర్టిఫికేట్లు, మెడల్స్ అందజేసి విద్యార్థులను సత్కరించారు. పిల్లల సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రీ ప్రైమరీ ఇన్చార్జ్ సిద్దిక, ఇతర ఇన్చార్జిలు, ఉపాధ్యాయులు ,విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యువ డాక్టర్ రామిరెడ్డికి ఎమ్మెల్యే ప్రశంసల జల్లు



**కలికిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

మదనపల్లి సొసైటీ కాలనీలో ఉన్న సహస్ర ఆర్థోపెడిక్ ఆసుపత్రి యువ డాక్టర్ రామిరెడ్డికి పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డి ప్రశంసల జల్లు కురిపించారు. యువ డాక్టర్ రామిరెడ్డి గుండ్లూరు పంచాయతీ జగిలవాండ్లపల్లె గ్రామానికి చెందినవారు. ఆయన వైద్య విద్యను అభ్యసించి మదనపల్లిలో ఆసుపత్రి నిర్మించి సేవలు చేస్తున్నారు. తమ గ్రామంలో ఉన్న చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని తన మామ అయిన గుండ్లూరు పంచాయతీ మాజీ సర్పంచ్ ఆర్.భాస్కర్‌రెడ్డి డా.రామిరెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన డా.రామిరెడ్డి ఆలయ అభివృద్ధికి తన సొంత నిధులు రూ.5లక్షలు విరాలంగా అందజేశారు. అంతేకాకుండా ఆలయ అభివృద్ధికి ఇంకా తన వంతు సహాయం చేస్తానని ఆలయ అభివృద్ధి తనకు ఎంతో సంతోషాన్ని ఇస్తోందని ఆయన ముందుకు వచ్చారు. బుధవారం ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభించేందుకు వచ్చిన ఎమ్మెల్యే యువడాక్టర్ దాతృత్వం ఆయన పేదలకు అందిస్తున్న సేవలు తెలుసుకొని డా.రామిరెడ్డిని దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు.

# కౌమార గర్భధారణపై అవగాహన కార్యక్రమం

**గాలివీడు: ఏప్రిల్ 22. ప్రభాతవార్త.**



కౌమార గర్భధారణ (టీనేజ్ ప్రెగ్నెన్సీ) నివారణపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఐసీడీఎస్ ఆధ్వర్యం లో గాలివీడు ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్థానిక సీడీపీఓ జహరబీ మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల చిన్న వయసులోనే గర్భం దాల్చిన బాలికలకు భవిష్యత్తులో రక్తహీనతతో పాటు పలు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. అనంతరం 8వ పోషణ పక్షవాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ పోషకాహారం తీసుకోవడం వల్ల పిల్లల మెదడు అభివృద్ధి మెరుగుపడుతుందని, గర్భిణీలు మరియు చిన్నపిల్లలు తప్పనిసరిగా సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. జిల్లా బాల పరిరక్షణ విభాగం రక్షణ అధికారి వెంకట రవి కుమార్ మాట్లాడుతూ ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే స్థానిక అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలను అడ్డుకుంటామని, పిల్లలకు ఎలాంటి సమస్యలు ఉన్నా 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని సూచించారు. అలాగే మే 1వ తేదీ నుంచి కిషోరి వికాసం కార్యక్రమం ప్రారంభం కానుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సి. చంద్రకళ, ఎంపీహెచ్ఓ సురేంద్ర రెడ్డి, గాలివీడు సూపర్వైజర్లు సోనీ, శివ సుబ్బమ్మ, పోలీస్ కానిస్టేబుళ్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర కార్ల దొంగ అరెస్ట్

### రూ.20 లక్షలు విలువ చేసే మూడు కార్లు స్వాధీనం ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**మదనపల్లె క్రైమ్, ఏప్రిల్ 22 ప్రభాతవార్త.**



అంతర్రాష్ట్ర కార్ల దొంగను బుధవారం ఒకటో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రూ. 20 లక్షల విలువైన మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రం చింతామణి కు చెందిన దేవరాజ్ కుమార్ చెడు వ్యసనాలకు, ఆన్ లైన్ బెట్టింగులకు, క్రికెట్ బెట్టింగులకు బానిసగా మారి సులభంగా డబ్బును సంపాదించేందుకు అలవాటు పడ్డాడన్నారు. దీంతో కార్ల ను దొంగతనాలు చేసి, వాటిని పక్క రాష్ట్రాలలో కుదువ పెట్టి డబ్బులు తెచ్చుకునేవాడన్నారు. ఈ క్రమంలో మదనపల్లె పట్టణంలో మూడు కార్లు అపహరించాడన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మదనపల్లె బెంగళూరు రోడ్డు, నక్కలదిన్నె ఆర్చి వద్ద అనుమానాస్పదంగా కారులో వెళుతున్న దేవరాజ్ కుమార్ ను పట్టుకుని విచారించగా దొంగలించిన కార్లు చూపించాడన్నారు. రూ. 6 లక్షల విలువైన ఇన్నోవా, రూ.3లక్షల విలువైన మహేంద్ర, రూ. 11,00,000 విలువైన ఇన్నోవా ఫార్చునర్ ను నిందితుడు నుంచి స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు. యువత చెడు మార్గంలో పయనించకుండా సన్మార్గంలో నడవాలన్నారు. ఆన్ లైన్ బెట్టింగ్, ఐపీఎల్ బెట్టింగ్ లకు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ఒక్కసారి వాటికి బానిసైతే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న ఆలోచనతో దొంగతనాలకు, దోపిడీలకు, పాల్పడడం జరుగుతోందన్నారు. జీవితాలను నాశనం చేసే బెట్టింగ్, ఆన్ లైన్ యాప్ లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితున్ని అరెస్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన వన్ టౌన్ సీఐ రాజారెడ్డి, ఎస్ఐ లు రహీముల్లా, చంద్రశేఖర్ హెడ్ కానిస్టేబుల్స్ సతీష్ కుమార్, చంద్రరాజు, పీసి లు రామ్మూర్తి నాయక్, మురళికృష్ణలను ఎస్పీ అభినందించి రివార్డులను అందజేశారు. ఈ సమావేశంలో ఏఎస్పీ వెంకటాద్రి, డిఎస్పి పావని, పలువురు సీఐలు, ఎస్సైలు , సిబ్బంది పాల్గొన్నారు.

# మామిడి తోటకు నిప్పు

**చౌడేపల్లి, ఏప్రిల్ 22 ప్రభాతవార్త**



ఆకతాయిల చేష్టలు రైతన్నల కంట తడిపెట్టిస్తున్నాయి. దూమపానం సేవించిన తర్వాత సిగరెట్ ముక్కలను పొలాల గట్లుపై పడేయడంతో గట్టు, పక్కనే వున్న పంటలు మాడి మసవుతున్నాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇటీవల కాలంలో మండల వ్యాప్తంగా పలు అగ్నిప్రమాదాలు సంభవించి లక్షల్లో మామిడి ఇతరత్రా వాణిజ్య పంటలు నష్టపోయారు. బుధవారం మురంకిందపల్లి సమీపంలోని డాక్టర్ మురళీనాయుడు, వేణుగోపాలనాయుడుల మామిడి తోటకున్న కంచె, అడవికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని రైతులు తెలిపారు. దీంతో ఇద్దరి రైతుల డ్రిఫ్ పరికరాలు, దాదాపు 50మామిడి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. చెట్లనిండా కాయలు కాసి వుండటంతో అగ్గిసెగకు పూర్తిగా పనికిరాకుండా పోయాయని రైతులు తెలిపారు. గ్రామస్తుల సహకారంతో మంటలను పూర్తిగా అదుపు చేసారు. సంబంధిత అధికారులు ఆకతాయిలపై నిఘా వుంచి ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

## మల్లయ్య కొండ భక్తుల సౌకర్యాలకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్ రెడ్డి



**తంబళ్లపల్లె ఏప్రిల్ 22 ప్రభాతవార్త ః**

తంబళ్లపల్లె కు సమీపంలోని మల్లయ్య కొండ లో వెలసిన భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ప్రాధాన్యత నివ్వాలని మల్లయ్య కొండ ఆలయ పునర్నిర్మాణ కర్త ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి దేవాదాయ శాఖ అధికారులకు సూచించారు. బుధవారం ఆయన తొలుత మార్గమధ్యంలోని వెలుగు మల్లమ్మ ఆలయాన్ని సందర్శించి ఆమెకు తొలి పూజలు నిర్వహించారు. అనంతరం మల్లయ్య కొండ మహా శివుని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ధూప దీప నైవేద్యాలు సమర్పించి తంబళ్లపల్లె నియోజకవర్గం లోని ప్రజలు, రైతులు పాడిపంటలతో సుఖ సంతోషాలతో జీవించాలని ఆ మహా శివుని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం అర్చకులు ఈశ్వరప్ప, మల్లికార్జున స్వాములు ఎమ్మెల్యేకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా భక్తుల అన్నదానం నిర్వహణ పై ఆరా తీసి సంతృప్తి పనిచేశారు. మల్లయ్య కొండపై భక్తులకు తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, స్వామి పుష్కరిణి, గౌరీ మాత ఆలయం, ఫారెస్ట్ అధికారులు ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్ లు పరిశీలించి సౌకర్యాలు పై భక్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి సోమవారం ఆర్టీసీ సర్వీసులు నిర్వహణ భక్తుల రాకపోకలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయన వెంట వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు దాటుతున్న వ్యక్తిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

### వ్యక్తికి తీవ్ర గాయాలు

**ములకలచెరువు ఏప్రిల్ 22 ప్రభాతవార్త**



ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ములకలచెరువులో చోటు చేసుకుంది. బాధితుడి కథన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మొలకలచెరువు మండలం, రెడ్డివారిపల్లి కి చెందిన పూజారి ఉదయ్ కుమార్ (40) రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఉదయ్ కుమార్ తన ద్విచక్ర వాహనం మరమ్మత్తులకు గురికావడంతో బుధవారం ఉదయం మండల కేంద్రంలో మెకానిక్‌కు రిపేర్‌కి వాహనాన్ని ఇచ్చాడు. అయితే ద్విచక్ర వాహనాన్ని తీసుకువెళ్లేందుకు మధ్యాహ్నం ములకలచెరువుకు రాగా రోడ్డు దాటుతుండగా మదనపల్లి నుంచి కదిరి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనం ఉదయ్ కుమార్ ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఉదయ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే గాయపడిన ఉదయ కుమార్ ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఉదయ్ కుమార్ తల తీవ్రంగా గాయపడ్డాడు.

## రైతులకు పశుగ్రాస విత్తనాలు పంపిణీ



**కలికిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

మేడికుర్తి పశువైద్యశాలలో పశుగ్రాస విత్తనాలు బుధవవారం పంపిణీ చేయడం జరిగింది. మండ లానికి పశుగ్రాసం మొక్కజొన్నలు 8 టన్నులు పశుగ్రాస జొన్నలు 4.5 టన్నులు రావడం జరిగిందని డా.వెం కటమునినాయుడు తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డా.కీర్తి, పశువైద్యసహాయ, ముడికుర్తి డా.ఎం.జగన్‌మోహన్‌రెడ్డి, పశువైద్య సహాయ శాస్త్ర చికిత్సకులు, పాలెం మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## పశుఆరోగ్య శిబిరం విజయవంతం



**కలికిరి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:**

మండలంలోని మర్రికుంటపల్లె పంచాయతీ ఎల్లంపల్లి గ్రామంలో బుధవారం తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా.ఎం.కె.జ్యోత్స్న, డా.నాగమణిల ఆధ్వర్యంలో నిర్వహించిన పశుఆరోగ్య శిబిరం విజయవంతమైంది. ఈ కార్యక్రమాన్ని కలికిరి పశుసంవర్ధకశాఖ ఏడీ డా.వెంకట మునినాయుడు ప్రారంభించారు. అనంతరం పశువులకు వైద్యచికిత్సలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో రైతులు, పశువులు పాల్గొనడంతో కార్యక్రమం విజయవంతమైంది. ఈ కార్యక్రమంలో మేడికుర్తి పశువైద్యాధికారిణి డా.కీర్తి, డా.జగన్‌మోహన్‌రెడ్డి, కృష్ణవేణి, ఎల్.ఎ.మమత, గోపాలమిత్ర అనిల్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన బద్వేల్ విద్యార్థి

బద్వేలు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త



బద్వేల్ మండలం గూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు ఏ. విజయభాస్కర్ రెడ్డి కుమారుడు హేమంత్ కుమార్ రెడ్డి జేఈఈ మెయిన్స్ 2026లో ఆల్ ఇండియా 27వ ర్యాంక్ సాధించి ప్రతిభ చాటాడు. ఓపెన్ కేటగిరీలో ఈ ర్యాంక్ సాధించడం విశేషంగా నిలిచింది. హేమంత్ విజయంపై ఆర్ఎస్ ఫౌండేషన్ చైర్మన్ మానుగుంట రవిశంకర్ స్పందిస్తూ, అతని కృషి, పట్టుదలతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహమే ఈ ఫలితానికి కారణమని తెలిపారు. ఈ విజయంతో బద్వేల్‌కు మంచి గుర్తింపు లభించిందని అన్నారు. భవిష్యత్తులో హేమంత్ మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి మరిన్ని విజయాలు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు ప్రశంసా పత్రాలు



సుండుపల్లి, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:

మండల పరిధిలోని బిలీవ్ ఫ్లవర్ హైస్కూల్ నందు 22 వ తేదీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమము ఘనంగా నిర్వహించామని కరస్పాండెంట్ నాగేశ్వరావు తెలియజేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎం ఎన్ ఆర్ కళాశాల కరస్పాండెంట్ అశోక్ రెడ్డి వచ్చి విద్యార్థులకు ప్రీ ప్రైమరీ ప్రైమరీ తరగతులకు సంబంధించి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్ మరియు సంవత్సరము హాజరుకు సంబంధించి సి వెంకట రోహిత్ ఎనిమిదవ తరగతి పూర్తి హాజరు, అలాగే పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు మరియు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం మ్యాడ్స్ నందు ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరింపజేశాయి.

## రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కూలింగ్ మిషన్ వితరణ



ప్రొద్దుటూరు అర్బన్ ఏప్రిల్ 22 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ అధికారి కార్యాలయం ఆవరణంలో ఏఎస్పీ విభూ కృష్ణ అనుమతితో ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ గందూరు శ్రీధర్ శర్మ, పిడిజి సాయి గోపాలకృష్ణ సంయుక్త సహకారంతో బుధవారం త్రాగునీటి కూలింగ్ మిషన్ ను వితరణ చేసారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విభూ కృష్ణ మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శ్రీధర్ శర్మ,గోపాలకృష్ణలు తమ కార్యాలయానికి కూలింగ్ మిషన్ ను, క్యాన్లు, గ్లాసులు అందజేయడం అభినందనీయమని రోటరీ సేవలు ప్రపంచవ్యాప్తంగా చాలా చక్కగా జరుగుతున్నాయని, రోటరీ వారి కార్యక్రమాలలో నేను పాల్గొనడం ఇది నాలుగో సారి అని అన్నారు. రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర్,రెడ్డి శ్రీధర్ శర్మ ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషమని మా డిస్ట్రిక్ట్ పక్షాన రోటరీ కుటుంబ సభ్యులకు అభినందనలు తెలియజేస్తున్నామని తెలియజేశారు. రోటరీ క్లబ్ సెక్రెటరీ గజ్జల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ డి.ఎస్.పి కార్యాలయంలో విజ్ఞాపన పత్రాలు అందజేసేందుకు వచ్చే ప్రజలు మరియు పోలీస్ శాఖ సిబ్బంది వేసవికాలంలో తమ దాహార్తిని తీర్చుకునేందుకు కూలింగ్ మిషన్ ను అందజేయడం అభినందనీయమన్నారు. గండూరు శ్రీధర్ శర్మ మాట్లాడుతూ మాకు ఈ అవకాశాన్ని కల్పించిన డి.ఎస్.పి విభూకృష్ణ మరియు కార్యాలయ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ బోర్డు డైరెక్టర్ జేవీర్ జాకీర్, అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

## వైభవంగా మహా పూజ కళ్యాణ మహోత్సవం



బ్రహ్మంగారిమఠం ఏప్రిల్ 22 ప్రభాతవార్త

శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి వారి మహా పూజ మరియు కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి బ్రహ్మంగారి దేవస్థానం మఠాధిపతులు శ్రీ వీర ధర్మజ వెంకటాద్రి స్వామి, మరియు జగన్నాత శ్రీ ఈశ్వరీ దేవి మఠం మఠాధిపతులు శ్రీ శివ కుమారస్వామి వారు దత్తాత్రేయ స్వామి, పిఠాధిపతి ప్రసాద్,మహా పూజ, కళ్యాణ మహోత్సవం పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన సత్రంలో అందరికీ అన్నదానాన్ని ఉభయదాతలు పూజ శివయ్య దంపతులు నిర్వహించారు.రాత్రి 8 గంటల నుండి శ్రీ గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మరియు జగన్మాత శ్రీ ఈశ్వరి దేవి గ్రామోత్సవం జరుగునని మరియు అల్పాహారం దాతలు గొడ్లవీటి సుబ్రమణ్యం దంపతులు ఏర్పాటు చేశారు. కావున బ్రహ్మంగారి దీక్షపరులు అందరూ పాల్గొని జయప్రదం చేయాలని దీక్ష పరులు పేర్కొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన అజెండా

పులివెందుల, ఏప్రిల్ 22, ప్రభాత వార్త :

ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన అజెండా అని నియోజక వర్గ ఇన్చార్జి బీటెక్ రవి అన్నారు. పులివెందుల లోని స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్ బీటెక్ రవి నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమకు ఎదురవుతున్న సమస్యలను వినిపించగా, బీటెక్ రవి వాటిని శ్రద్ధగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. పులివెందుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే తన ముఖ్య ధ్యేయమని స్పష్టం చేశారు.ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను విని, సంబంధిత అధికారులతో చర్చించి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



# వైభవంగా విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు

దువ్వూరు, ఏప్రిల్ 22, ప్రభాతవార్త:

మండల పరిధిలోని గుడిపాడు, గొల్లపల్లె రహదారిలో ఉన్న శ్రీ సాక్షిమల్లేలమ్మ మరియు పోతు రాజు స్వామి విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలు బుధవారం వైభవంగా జరిగాయి. 3 రోజుల పాటు జరిగిన ఈ విగ్రహ ప్రతిష్ట ఉత్సవాలలో వేద పారాయణం, గణపతి పూజ, మంగళహారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ప్రధాన కలుష పూజలు, ఉద్వాసన, దేవాలయ ప్రదక్షిణలు, కలుషాభిషేకములు నిర్వహించి విగ్రహ ప్రతిష్టను గావించారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన భక్తులకు అన్నదాన సౌకర్యాన్ని కల్పించారు. అలాగే బండలాగుడు పోటీలను రాష్ట్ర వ్యవసాయ మాజీ సలహాదారులు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి ప్రారంభించారు.





ఈ బండలాగుడు పోటీలలో వివిధ ప్రాంతాల నుండి 7 జతల కాల్లు పాల్గొనగా మొదటి స్థానాన్ని తెలంగాణ ఎద్దులు సాధించాయి. అలాగే రెండవ స్థానాన్ని గొల్లపల్లె ఎద్దులు గెలుచుకున్నాయి. వీటికి బహుమతులను నిర్వాహకులు అందజేశారు.

## పోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే క్రమశిక్షణ, నిబద్ధత ఉండాలి





పులివెందుల ఏప్రిల్ 22, ప్రభాతవార్త :

ఆపోటీ ప్రపంచంలో నెగ్గుకు రావాలంటే క్రమశిక్షణ, నిబద్ధత ఉండాలి అని డాక్టర్లు రవీంద్రారెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి లు పేర్కొన్నారు.స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత విద్య ఉపాధ్యాయ బృందంచే ఈ ఏడాది ప్రభుత్వం నిర్వహిస్తున్న పాలీసెట్,ఏపీఆర్ జేసీ ప్రవేశాలకు పాత సత్రం పాఠశాలలో స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఉచిత కోచింగ్ ముగింపు సమావేశం బుధవారం నిర్వహించడం జరిగింది. గత 15 రోజుల పాటు చేపట్టిన 15 నమూనా పరీక్షలలో బాలుర విభాగం లో ప్రతిభ చూపించి ప్రథమ స్థానంలో వేద వ్యాస్ రెడ్డి, ద్వితీయ స్థానంలో గిరీష్ రెడ్డి, తృతీయ స్థానంలో సుఫియాన్ లు నిలవగా... బాలికల విభాగం లో ప్రథమ స్థానం దీపిక, ద్వితీయ స్థానం రూప, తృతీయ స్థానంలో నిలిచారు. ఈ విద్యార్థులకు డాక్టర్ రవీంద్రారెడ్డి, డాక్టర్ హర్షవర్ధన్ రెడ్డి, మండల విద్యా శాఖ అధికారి చంద్రశేఖర్ రావ్,ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, లింగాల మండల విద్యా శాఖ అధికారి రామక్రిష్ణయ్య, ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం రామసుబ్బారెడ్డి,డాక్టర్ ఓబుల్ రెడ్డి, వెంకటనా రాయణ, సుబ్బారెడ్డి,నరేంద్ర గుప్తా,కృష్ణారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, శేష మహేశ్వర మ్మ,శ్రీదేవి,విజయానందన్ రెడ్డి, వీర భాస్కర్,శివ గంగాధర్ రెడ్డి, సురేష్ రెడ్డి,సూర్య నారాయణ రెడ్డి,సేవాసమితి అధ్యక్షులు రాజు ల చేతులమీదుగా బహుమతులు మరియు ఉపాధ్యాయ బృందం కి జ్ఞాపికలు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండు వేసవిలో పేద విద్యార్థులకు శిక్షణ ఇవ్వడానికి ముందుకు వచ్చిన ఉపాధ్యాయులు అభినందనీయులన్నారు. ఒక లక్ష్యాన్ని ఎంచుకొని క్రమశిక్షణ తో ముందుకు సాగితే ప్రతి విద్యార్థికి విజయం దక్కుతుందని అన్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లిన తర్వాత రాజు లాగా సేవ చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం మాట్లాడారు. చివరగా నిర్వాహకులు రాజు మాట్లాడుతూ ఉపాధ్యాయ బృందానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమం లో సేవాసమితి సభ్యులు చాంద్ బాషా, రాఘవేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రారంభోత్సవంలో తెలుగుతమ్ముళ్ల మధ్య రచ్చ

:నిధులు మేము తెచ్చామని రితేష్‌రెడ్డి వర్గం :ప్రారంభోత్సవం మేము చేస్తామని డీసీసీ వర్గం :రంగప్రవేశం చేసిన పోలీసులు





బద్వేలు ,ఏప్రిల్ 22, ప్రభాతవార్త:

బద్వేలు మున్సిపాలిటీకి రూ.3కోట్లు నిధులు మంజూరుకావడంతో రోడ్డు ప్రారంభోత్సవం చేసేందుకు అధికారులు సిద్ధం చేయడంతో కాంట్రాక్టర్ సూర్యనారాయణరెడ్డి వర్గానికి చెందిన వారని వారి చేత ప్రారంభోత్సవం చేయిస్తారని రితేష్‌రెడ్డి వర్గం అడ్డుకునే ప్రయత్నం చేశారు. మున్సిపాలిటీలో రోడ్డు పనులకోసం ప్రత్యేక నిధులను తెచ్చేందుకు టీడీపీ ఇన్‌చార్జి రితేష్‌రెడ్డి కృషిచేస్తే డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి చేత చేయించేందుకు రంగంసిద్ధం చేయడంతో రితేష్ వర్గ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉదయం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు ఎన్‌జీవో కాలనీ వద్ద ప్రారంభోత్సవం అడ్డుకునే ప్రయత్నం చేపట్టారు. ఇది తెలుసుకున్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి వెనక్కి తగ్గినట్లు సమాచారం. ఇరువర్గాలు అక్కడికి చేరుకోవడంతో గొడవ జరుగుతుందని ముందుగానే ఊహించిన పోలీసులు రంగ ప్రవేశం చేసి ఎలాంటి ఘటన చోటు చేసుకోకుండా అడ్డుకున్నారు. ప్రారంభోత్సవానికి పనులు జరగకపోవడంతో వెను తిరిగారు. రోడ్డ పనులకు నిధులు తెచ్చింది రితేష్‌రెడ్డి అని అయితే సూర్యనారాయణరెడ్డి చేసేందుకు ఎలా ముందుకు వస్తారని బద్వేలు పట్టణ టీడీపీ అధ్యక్షులు వెంగళరెడ్డి అన్నారు.మున్సిపాలిటీలోని 35 వార్డులకు నిదులు సమానంగా పంచి పనులు చేసేందుకు శ్రీకారం చుట్టాలి గాని ఇలా ఒక్కచోటడబ్బులు పెట్టాలనుకోవడం మంచిది కాదని, ఎవరో కాంట్రాక్టర్‌కు పనులు వచ్చినప్పటికీ స్థానిక నాయకులను సంప్రదించకుండా ఇక్కడి సమస్యలు తెలుసుకోకుండా ఎలా చేస్తారని వెంగళరెడ్డి అన్నారు. అయితే రోడ్డు ప్రారంభోత్సవ పనులు తామే చేయాలని ఇరువర్గాలు పట్టుబట్టినట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి పోలీసులు అడ్డుకున్నా తర్వాతి పరిణామాలు ఎలా ఉంటాయోనని పోలీసులు భయపడుతున్నారు. గత కొద్ది కాలంగా ఇరువర్గాల మధ్య పచ్చిగడ్డి వేస్తే భగ్గుమన్న నేపథ్యంలో అటు కార్యకర్తలు, ఇటు ప్రజలకు నష్టం జరిగే పరిస్థితి ఉందని భావించి పోలీసులు ఎప్పటికప్పుడు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతానికి రోడ్డు పనుల ప్రారంభోత్సవం ఉపక్రమించుకున్నా ఏదో ఒక రోజు డీసీసీ బ్యాంక్ చైర్మన్ సూర్యారాయణరెడ్డి చేతుల మీదుగా జరుగుతాయని ఈ విషయాన్ని కార్యకర్తల దృష్టికి తీసుకెళ్లడంతో ఎప్పటికప్పు కార్యకర్తలు అప్రమత్తంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా రోడ్డు ప్రారంభోత్సవంతో ప్రారంభమైన ఈ గొడవ ఏ స్థాయికి చేరుతుందో అర్థం కాని పరిస్థితి. ఇప్పటికే నాయకులు, కార్యకర్తలు అటు ఒక కాలు, ఇటు ఒక కాలు వేసి పార్టీని ముందుకు తీసుకెళుతున్నారు. దీనివలన జరిగే నష్టమే ఎక్కువ అని సీనియర్ నాయకులు అంటున్నారు.

## భక్తి శ్రద్ధలతో శ్రీ దుర్గమ్మ ఆలయ మండల పూజ

### పంచామృతాభిషేకం, చండీ పారాయణం, హోమాలు

### భక్తులకు తీర్థప్రసాదం, అన్నదానం ఆలయ వ్యవస్థాపకులు ఎమ్. రవికుమార్ రెడ్డి

వేంపల్లె: ఏప్రిల్ 22 ప్రభాతవార్త

స్థానిక పట్టణంలోని సాయి నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ దుర్గమ్మ దేవస్థానంలో బుధవారం మండల పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించినట్లు ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి తెలిపారు. ఆలయ అర్చకులు విష్ణు స్వామి నేతృత్వంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం మండల పూజ కార్యక్రమాలలో భాగంగా బ్రహ్మశ్రీ రాయిపెద్ది సుబ్బరామశర్మ నేతృత్వంలో అభిషేకం, గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండప ఆరాధన, చండీ పారాయణం, చండీ హోమం, గోమాత పూజ, మహా మంగళహారతి, మంత్రపుష్పం తదితర పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు మాచిరెడ్డి రవికుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం దుర్గమ్మ నామస్మరణతో మారుమ్రోగింది. ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలదండలతో అలంకరించారు. ప్రతి మంగళవారం సుమంగలి పూజ, ప్రతి శుక్రవారం రాహుకాల పూజలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



# చంద్రబాబు పాలనలో
# రాష్ట్రం అప్పుల కుప్ప

**కాగ్ అక్షింతలతోనైనా కళ్ళు తెరవాలి.**

**డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి.**

వేంపల్లి: ఏప్రిల్ 22 ప్రభాతవార్త



చంద్రబాబు పాలనలో రాష్ట్రం అప్పుల కుప్ప అయిందని,రుణాంధ్రప్రదేశ్ అయిందని రాజ్యసభ మాజీ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి నిప్పులు చెరిగారు. బుధవారం వేంపల్లిలో తులసి రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత వైకాపా పాలనలో 60 నెలల్లో 3,32, 000 కోట్ల రూపాయలు అప్పు చేయగా, ప్రస్తుతం చంద్రబాబు ప్రభుత్వం 22 నెలల్లోనే మూడు లక్షల 56వేల 655 కోట్ల రూపాయలు అప్పు చేసిందన్నారు. ఇందులో బడ్జెట్ రుణాలు 1,98,564 కోట్ల రూపాయలు కాగా, కార్పొరేషన్ గ్యారెంటీ ల ద్వారా ఒక్క లక్ష పదివేల 704 కోట్ల రూపాయలు కాగా, రాజధాని పేరుతో 47 వేల 387 కోట్ల రూపాయలు చంద్రబాబు ప్రభుత్వం అప్పు చేసిందని తులసిరెడ్డి వివరించారు. కోడలికి బుద్ధి చెప్పి అత్త తెడ్డు నాకింది అన్న సామెతను చంద్రబాబు ప్రభుత్వం గుర్తు చేస్తుందన్నారు. గత వైకాపా ప్రభుత్వం శక్తికి మించి అప్పులు చేసిందని విమర్శించిన చంద్రబాబు ప్రస్తుతం అంతకుమించి అప్పులు చేయడం గర్హనీయం అన్నారు. కాగ్ అక్షింతలతోనైనా చంద్రబాబు ప్రభుత్వం కళ్ల తెరవాలని తులసి రెడ్డి హితువు పలికారు. 2024 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ ఇచ్చిన నివేదికను గత మార్చి ఆరో తారీఖున అసెంబ్లీలో ప్రవేశపెట్టడం జరిగింది రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక క్రమశిక్షణ లేదని, రాష్ట్రానికి ఆర్థిక స్థిరత్వం లేదని, రాష్ట్ర భవిష్యత్తు అంధకారమని,గడ్డు కాలమని నివేదికలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. 2024 25 ఆర్థిక సంవత్సరం లో అప్పులకు సంబంధించి బడ్జెట్ అంచనాలు 68743 కోట్లు కాగా సంవత్సరం చివరి నాటికి ప్రత్యక్ష అప్పులు 81 వేల 71 కోట్లు అయ్యాయి. అనగా 16 శాతం పెరిగాయి. అదే సమయంలో మూలధన వ్యయం లో 50 శాతం తగ్గింది. బడ్జెట్ అంచనా రు 32,713 కోట్లు కాగా వాస్తవంగా ఖర్చు చేసింది కేవలం 16,141 కోట్ల రూపాయలు మాత్రమే. కేంద్రం నుంచి గ్రాంట్ తెచ్చుకోవడంలో కూడా చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. 2024 25 సంవత్సరానికి సంబంధించి రు 30,333 కోట్లు వస్తుందని అంచనా వేయగా కేవలంరు 20188 కోట్లు మాత్రమే కేంద్రం నుండి రాష్ట్రానికి వచ్చింది. అనగా 10145 కోట్ల రూపాయలు తగ్గింది. 2024 25 ఆర్థిక సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వం 365 రోజులకు గాను 357 రోజులు రిజర్వ్ బ్యాంకు దగ్గరికి దేహీ అంటూ చేబదుళ్లకు పోయింది. ఇప్పటికైనా అప్పుచేసి పప్పుకూడు తినడం మానుకొని, ఆర్థిక క్రమశిక్షణ పాటించి రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేయొద్దని తులసి రెడ్డి చంద్రబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

### ప్రజలు అసాంఘిక కార్యక్రమాలకు
# దూరంగా ఉండాలి



మన్నూరు గ్రామసభలో మాట్లాడుతున్న సిఐ లింగప్ప

రాజంపేట, ఏప్రిల్ 22 ప్రభాతవార్త

అసాంఘిక కార్యక్రమాలకు ప్రజలు దూరంగా ఉండాలని ,పరిసర ప్రాంతాల్లో ఎలాంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరుగుతున్న పోలీసుల దృష్టికి తీసుకురావాలని మనూరు సిఐ ఎస్.లింగప్ప కోరారు. బుధవారం మన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని నారపు రెడ్డి పల్లి, మన్నూరు గ్రామాలలో గ్రామ సభ నిర్వహించారు. సైబర్ క్రైమ్ , బాల్యవివాహాలు , చీటింగ్, సోషల్ మీడియా వల్ల కలిగే అనర్థాలు వంటి వాటిపై ప్రజలకు అవగాహన కోసం మన ఊర్లో గ్రామసభ నిర్వహించారు. పేకాట, గంజాయి, అక్రమ మద్యం, నాటు సారా విక్రయిస్తే అటువంటి వారిపై పోలీసు శాఖ పరంగా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఉంటుందని ఎక్కడైనా గొడవలు సృష్టించాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని మన్నూరు సి.ఐ లింగప్ప హెచ్చరించారు.నేరాల నియంత్రణ కోసం పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టడం జరిగిందని, అందులో భాగంగా ప్రజలు కూడా మీ గ్రామాలలో ఎక్కడైనా ఏ సమస్యలు ఉన్నా, అపరిచిత వ్యక్తులు ఎవరైనా సంచరిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. అందరూ కలసి మెలసి ఉండాలని సూచించారు.ఈ గ్రామ సభలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్ వరం

బద్వేలు ,ఏప్రిల్ 22, ప్రభాతవార్త:

బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్ వరం లాంటిది డాక్టర్ వై శ్రీనివాసులు పట్టణ ఆరోగ్య కేంద్రం సురేంద్ర నగర్ బద్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు 14 సంవత్సరాల నుంచి 15సంవత్సరాల లోపల బాలికలకు, మహిళలలో గర్భాశయముఖ ద్వారా క్యాన్సర్ నివారణ కొరకు 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాల వరకు బాలికలకు వాక్సిన్ యొక్క ప్రాముఖ్యతను పై అవగాహన కల్పించడమైనది. ఈ కార్యక్రమంలో డాక్టర్ వై. శ్రీనివాసులు మరియు జి సుబ్బారెడ్డి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంయుక్తంగా తెలియజేస్తూ మహిళల్లో వచ్చు గర్భాశయం ముఖ ద్వారా క్యాన్సర్ నివారణ కోసం హెచ్. పి. వి బాగా పనిచేయునని, అదేవిధంగా అర్హులైన బాలికలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవడం వల్లనే ఇది పూర్తగ శురక్షితమైనదని వారి తల్లిదండ్రులకు మరియు బాలికలకు అవగాహన కల్పించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రము తోట్టి గారి పల్లె, సురేంద్ర నగర్ నందు 50 మందికి టీకా వేయడమైనది, ప్రతి అర్హులైన లబ్ధిదారులను వివన్ ఫోటోల్లో ఎంటర్ చేసి వ్యాధి నిరోధక టీకాల సర్టిఫికెట్ ఇవ్వడమైనది, ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీస్ బి వెంగయ్య అసిస్టెంట్ ప్రధానోపాధ్యాయులు ఏ. రామయ్య హెల్త్ అసిస్టెంట్ వి జనార్దన్ రావు మరియు ఏ. ఎన్.యం లు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పిద్దాం

సిద్ధవటం ఏప్రిల్ 22, ప్రభాతవార్త

విద్యార్థులప్రగతికి, ఉజ్వల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే బలమైన పునాది అని యు.టి.ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి సమీర్ బాషా పేర్కొన్నారు. 'బడి పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా సిద్ధవటం మండలంలోని పలు గ్రామాల్లో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరుతూ తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల మేధో వికాసానికి, సర్వతోముఖాభివృద్ధికి బాటలు వేస్తాయని అన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించడమే కాకుండా, సవాళ్లను ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకుంటారని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోతులూరయ్య మాట్లాడుతూ.. విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక వసతులతో కూడిన నాణ్యమైన విద్యా వాతావరణం అందుబాటులో ఉందని చెప్పారు. ఉపాధ్యాయులు రామసుబ్బారెడ్డి, రవిశంకర్, సిరాజుల్లా, రామయ్య, చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పేద, వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ పాఠశాలలు ఆశాదీపాలని, ఇటువంటి విద్యాసంస్థలను కాపాడుకోకపోతే సమాజ భవిష్యత్తు అంధకారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల వయస్సున్న పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వారు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వివిధ సౌకర్యాల గురించి వారు వివరించారు. ఈ ప్రచారంలో భాగంగా మూలపల్లి, ఎస్. రాజంపేట, వంటటిపల్లి, జంగాలపల్లి, వెలుగుపల్లి, మాధవరం, భాకరాపేట, కానపురం, కొమ్మనాయనిపల్లి గ్రామాలను సందర్శించి, తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పోతులూరయ్యతో పాటు ఉపాధ్యాయులు సమీర్ బాషా, రామసుబ్బారెడ్డి, రవిశంకర్, రామయ్య, సిరాజుల్లా, చంద్రశేఖర్, షేక్ మోలాలీ, హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

